


# ఆనందం

-యస్.డి.వి.అజీజ్

హడావుడిగా డ్రస్సప్పవుతోన్న భర్త శంకర్ వంక చూస్తూ అడిగింది వకుళ.

"ఎక్కడికండి? ఇంత ఉదయాన్నే బయల్దేరారు. మీరు ఆఫీసుకు వెళ్ళేది పదింటికి కదా!"

"ఓ ఫ్రెండ్‌ను కలవాలి" కాలికి బూట్లు తొడుక్కొంటూ చెప్పాడు శంకర్." ఆ ఫ్రెండ్ ఎవరో నే తెలుసుకోవచ్చా?"

భార్య పలుకుల్లో అనుమానం ధ్వనించటంతో, శంకర్‌కు నవ్వు పుట్టుకొచ్చింది. "ఇన్నేళ్ళుగా కాపురం చేస్తోన్నా, ఇంకా నాపై అనుమానమా?" భార్యను దగ్గరిగా తీసుకొని ఆమె భుజంపై చేతులు వేసి ఆమె కళ్ళలోకి చిలిపిగా చూస్తూ పలికాడు.

"ఓ గళ్‌ఫ్రెండ్‌ను రిసీవ్ చేసుకోవడానికి వెళ్తున్నాను."

"చాల్లేండి జోకులు!" అంది వకుళ.

"లేకపోతే మరేమిటోయ్! ఎంతో ముఖ్యమైన పనుంటేనేగా వెళ్ళేది?" చెప్పాడు శంకర్.

"అదే నేను అడుగుతున్నది అంత ముఖ్యమైన పని ఏమిటా అని?"

"వచ్చాక అన్నీ డిటెయిల్డ్‌గా చెబుతాను. మరి నే వెళ్ళిరానా?" భార్య బుగ్గపై చిటిక వేస్తూ అన్నాడు.

"కాఫీ తాగి వెళ్ళండి!"

"అంత టైం లేదు. వస్తాను..." అనేసి భార్యనుంచి వీడ్కోలు తీసుకొని ఇంటినుంచి బయటికి వచ్చాడు శంకర్.

❋ ❋ ❋

సెంట్రల్ జైలు చేరుకొన్న శంకర్ తన ఐడెంటిటీ కార్డు చూపించి తాను కలవాలనుకొన్న ఖైదీ వివరాలు చెప్పి అడిగాడు. "అతన్ని ఇంకెంత సేపట్లో రిలీజ్ చేస్తారు?"

"అతను ఓ నెల క్రితమే రిలీజ్ అయి వెళ్ళిపోయాడు."

"నాకు ఈరోజున రిలీజ్ అవుతున్నట్టుగా ఉత్తరం వ్రాశాడు."

"ఫెస్టివల్ హాలిడేస్", ఆదివారాలు కలుపుకొని ఏడాదికి రెన్నెళ్ళు తగ్గుతుంది. బ్లడ్ డోనేట్ చేస్తే మరో రెన్నెళ్లు తగ్గిస్తారు. మీరు అడిగిన వ్యక్తి బ్లడ్ డొనేట్ చేయటంవల్ల అనుకొన్న సమయంకంటే ముందే అయి వెళ్ళిపోయాడు."

"రిలీజ్ అవుతూ ఏమైనా చెప్పాడా? ఐమీన్ ఎక్కడికి వెళ్ళేది?"

"రిలీజ్ అయ్యే ఖైదీలు, వాళ్ళ ఉద్దేశ్యాలను మాకు చెప్పరు. మేము అడగం కూడా! వారు ఎక్కడికి వెళ్తారో మాకు తెలియదు. తెలుసుకోవాలన్న ఆసక్తికూడా మాకు వుండదు."

జైలు సెక్యూరిటీ ఆఫీసర్ చెప్పింది విన్న శంకర్‌కు ఇంకేం అడగాలో తోచలేదు. 'వస్తానండి!'అని మాత్రం అనగలిగాడు. జైలు ఆవరణనుంచి బయటికి వచ్చాక సిగరెట్ ముట్టించి ఆలోచనలో పడ్డాడు.

"ఎక్కడికి వెళ్ళుంటాడు? రిలీజింగ్ డేట్‌లో మార్పు గురించి మరో ఉత్తరం ద్వారా నాకు తెలియపరచవచ్చుగా? ఎందుకు తెలియచేయకుండా వుండిపోయాడు? నేరుగా ఇంటికి వెళ్ళుంటాడు? తనకు వ్రాసిన ఉత్తరంలో ఇంటికి వెళ్ళే ఉద్దేశ్యంలేదని తెలియపరిచాడు. కాబట్టి ఇంటికి వెళ్ళుండడు. మరెక్కడికి వెళ్ళి వుంటాడు? ఎంతగా ఆలోచించినా బుర్రకు తట్టక అక్కడ్నుంచి బయల్దేరాడు శంకర్.

❋ ❋ ❋

నిరుత్సాహంగా ఇంటికి చేరిన భర్త వంక చూస్తూ అడిగింది. "మీ ఫ్రెండ్‌ను కలిశారా?"

**అభిజిత్ ఓ మంచి ఆర్టిస్ట్. ఎన్నో అద్భుతమైన చిత్రాలు వేశాడు. చిత్రకారుల్లో అతనిదో ప్రత్యేక శైలి. అతని వృత్తి, ప్రవృత్తి, ఊపిరి చిత్రాలు గీయటమే! నాకూ అనుకోకుండా ఓ రెండేళ్ళ క్రితం పరిచయం అయ్యాడు. అతను మాట్లాడుతుంటే ఎంతసేపయినా వినాలనిపిస్తుంది.**

"లేదు. నేను వెళ్ళేసరికి వెళ్ళిపోయాడు" వాలుకుర్చీలో వాలిపోతూ అన్నాడు శంకర్.

"ఇంతకు ఎవరతను?"

"చెప్పాగా ఫ్రెండ్?"

"ఫ్రెండే! అతని వూరూ పేరు వుండదా?"

"అతని పేరు అభిజిత్. ఈ వూరే!"

"అలాంటి ఫ్రెండ్ మీకు వున్నట్టు నేనెప్పుడు వినలేదే?"

"ఎందరో ఫ్రెండ్స్ వుంటారు. అందరి గురించి నీకు చెప్పాలా ఏమిటి?" చికాకు ప్రదర్శిస్తూ అన్నాడు శంకర్.

ఇద్దరి మధ్య కాసేపు మౌనం. ఆ మౌన సమయంలో తన చిరాకును తగ్గించుకొని, భార్య వంక చూస్తూ చెప్పాడు.

"సారీ! మూడ్ డిస్టర్బ్‌గా వుండి చిరాకు పడ్డాను."

"అసలు మీరిలా డిస్టర్బ్ కావటం దేనికి. అసలు ఎవరా అభిజిత్. అతన్ని మీరెందుకు కలవాలనుకొంటున్నారు?"

ఓ నిట్టూర్పు విడిచి భార్య అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పుకొచ్చాడు శంకర్.

"అభిజిత్ ఓ మంచి ఆర్టిస్ట్. ఎన్నో అద్భుతమైన చిత్రాలు వేశాడు. చిత్రకారుల్లో అతనిదో ప్రత్యేక శైలి. అతని వృత్తి, ప్రవృత్తి, ఊపిరి చిత్రాలు గీయటమే! నాకూ అనుకోకుండా ఓ రెండేళ్ళ క్రితం పరిచయం అయ్యాడు. అతను మాట్లాడుతుంటే ఎంతసేపయినా వినాలనిపిస్తుంది. ఎన్నో విషయాలను ఎంతో విశ్లేషణాత్మకంగా చెప్పేవాడు. అలాంటి వ్యక్తి ప్రేమలోపడ్డాడు. అతను మనసుపడ్డ అమ్మాయి బ్రతక నేర్చిన వ్యక్తి. దానికంటూ, దీనికంటూ అతని సంపాదన, చివరికి అతనికి పెద్దలనుంచి సంక్రమించిన వాటా సైతం తన కోసం ఖర్చుచేసేలా వొయ్యారాలు పోయింది. పెళ్ళి ప్రస్తావన వచ్చినప్పుడల్లా వాయిదావేస్తూ వచ్చిన ఆమెను ఓరోజు నిగ్గదీసి అడిగాడు.



ఇంటి వైద్యం

★ అరటిపండును ఎండించి చూర్ణం చేసుకొని పాలతో కలిపి త్రాగితే మంట తగ్గుతుంది. ★ పిప్పళీ, శొంఠి, కరక్కాయలను సమంగా గ్రహించి వాటికి నువ్వులు, బెల్లం కలిపి మెత్తగా నూరి ఉదయం- సాయంత్రం సేవిస్తే అల్సర్ తగ్గుతుంది.

"మా ఇంట్లో ఒప్పుకోవటం లేదు" అని చెప్పిందట.

"ఎలాగయినా ఒప్పించు" అన్నాడట.

"కుదర్దు..." అందట.

"ఎటయినా వెళ్ళి పెళ్ళిచేసుకొందాం" అన్నా వినలేదట.

దానికి కూడా సుతారం ఇష్టం చూపకపోయేసరికి ఇతనికి ఆవేశం తన్నుకొచ్చింది. ఆమెతో గొడవకు దిగాడు. ఆ గొడవలో ఆమెపై చెయ్యి చేసుకొన్నాడు.

అంతే!

అంతవరకూ అతనే లోకంగా ప్రేమపక్షిలా చిలక పలుకులు పలికిన ఆమె... నేరుగా పోలీస్టేషన్‌కు వెళ్ళి... తనను ప్రేమించమంటూ వేధిస్తున్నాడని, తను అంగీకరించనందున చివరికి చెయ్యి చేసుకొన్నాడని, నానా దుర్భాషలాడాడని కంప్లయింట్ ఇచ్చింది. పోలీసులు ఇతన్ని అరెస్ట్‌చేసి కేసు పెట్టారు. కేసులో అపద్ధపు సాక్షుల సాక్ష్యంవల్ల ఇతనికి ఏడాది జైలు శిక్ష పడింది. దాంతో అతను మెంటల్లీ చాలా డిస్టర్బ్ అయ్యాడు. అప్పీలు చేసుకోమన్న చేసుకోలేదు. జైలుశిక్షను అనుభవించడానికే నిర్ణయించుకొని జైలుకు వెళ్ళిపోయాడు. అతను నాకు జైలునుంచే ఆఫీసుకు ఉత్తరాలు వ్రాసేవాడు. నేనూ వెళ్ళి రెండుసార్లు కలిసొచ్చాను. ఫలానా తేదీన విడుదల కాబోతున్నానని, జైలుదగ్గరికి రమ్మని ఉత్తరం వ్రాశాడు. అతను ఉత్తరం వ్రాసిన ప్రకారం ఈరోజు జైలు దగ్గరికి వెళ్ళాను.

కాని అతను నెల రోజుల క్రితమే రిలీజ్ అయి వెళ్ళిపోయాడట. ఉత్తరాల్లో ఇంటికి వెళ్ళను. అని వ్రాశాడు. మరి అతను ఎక్కడికి వెళ్ళాడో ఏమిటో అర్థంకావటం లేదు." అని చెబుతూ నిట్టూర్చాడు శంకర్.

"ఇంటికి ఎందుకు వెళ్ళకూడదనుకొన్నాడు అతను."

"ఇంట్లోవారు చూసిన సంబంధంకాదని, ఆమె వెంట పడినందుకు ఆమెకు సర్వం దోచిపెట్టినందుకు. ఇంట్లో వాళ్ళకు అతనిపై కోపం."

"ఎక్కడికి వెళ్ళి వుంటాడంటారు?"

"అదే నాకూ అర్థం కావటంలేదు."

"ఎందుకయినా మంచిది ఓ మారు అతనింటికి ఫోన్ చేసి చూడండి!"

భార్య సలహామేరకు అభిజిత్ ఇంటికి ఫోన్ చేశాడు.

"రాలేదు" అన్న సమాధానం వచ్చింది.

"ఫ్రెండ్స్ దగ్గరికి వెళ్ళాడేమో వాళ్ళకూ ఫోన్ చేయండి!"

అతనికి, తనకు తెలిసిన ఫ్రెండ్స్ అందరికి ఫోన్ చేశాడు. అందరి దగ్గర్నుంచి ఒకటే సమాధానం రాలేదని. శంకర్‌తోపాటు వకుళ కూడా ఆలోచనలో పడుతూ అడిగింది. "ఇలాంటి స్నేహితుడు వున్నట్టు నాకెందుకు చెప్పలేదు."

"సందర్భం రాక చెప్ప లేదు. అంతే కాని... మరో ఉద్దేశ్యం ఏమీ లేదు.

ఈమారు వకుళ నిట్టూర్పు!

భార్యాభర్తలిద్దరు కలిసి ఆలోచించటం ప్రారంభించారు.

❋ ❋ ❋



**అతను నాకు జైలునుంచే ఆఫీసుకు ఉత్తరాలు వ్రాసేవాడు. నేనూ వెళ్ళి రెండుసార్లు కలిసొచ్చాను. ఫలానా తేదీన విడుదల కాబోతున్నానని, జైలుదగ్గరికి రమ్మని ఉత్తరం వ్రాశాడు. అతను ఉత్తరం వ్రాసిన ప్రకారం ఈరోజు జైలు దగ్గరికి వెళ్ళాను. కాని అతను నెల రోజుల క్రితమే రిలీజ్ అయి వెళ్ళిపోయాడట.**

ఓ నెల రోజులు గడిచాయి.

అభిజిత్ నుంచి శంకరానికి ఉత్తరం వచ్చింది. అందులో...

శంకరంగార్కి,

మీరు నాకోసం జైలు దగ్గరికి వచ్చిపోయి వుంటారనుకొంటాను. మిమ్మల్ని రమ్మని చెప్పి, నేను రిలీజ్ అయి బయటికి వెళ్ళటం అన్నది అనుకోకుండా జరిగిపోయింది. నేను రక్తదానం శిక్ష కాలం తక్కువ కావడానికి చేయలేదు. నా రక్తం ఇతరులకు ఉపయోగపడ్డం కన్నా సార్థకం ఏముంది అనిపించింది. స్వచ్ఛందంగా ఇచ్చాను.

ఫలితంగా శిక్ష తగ్గింపు.

నాకు కేటాయించిన గడువు దాక వుంటాను అని చెప్పాను. అందుకు రూల్స్ ఒప్పుకోక మీరు వెళ్ళాల్సిందే అన్నారు. పంపించేశారు. నేను జైల్లో వున్నప్పుడు పత్రికలో ఓ ఆశ్రమం గురించి చదివాను. జైలు నుంచి రిలీజ్ అయ్యాక అక్కడికే వెళ్ళాను. ఈ ఉత్తరం అక్కడ్నుంచే వ్రాస్తున్నాను. ఇక్కడి స్వామిజీకి నా గురించి అంతా చెప్పాను. వుండిపోమన్నారు. ఇక మళ్ళీ ఐహిక ప్రపంచంలోకి రాకూడదని, ఆశ్రమ జీవిగానే జీవితం కొనసాగించాలని నిర్ణయించుకొన్నాను. ఆరోజు మీరు జైలుకు వచ్చినపుడు నేను లేనందుకు, మిమ్మల్ని కలవకుండానే వెళ్ళినందుకు క్షంతవ్యుడిని. వుంటాను.

ఇట్లు


అభిజిత్


ఉత్తరం చదివిన శంకరం ఆలోచనలో పడ్డాడు. ఆఫీసునుంచి ఇంటికొచ్చాక ఉత్తరాన్ని భార్య వకుళకు చూపించాడు. ఉత్తరం చదివిన వకుళ, "అంతటి ప్రతిభావంతుడు, అలా ఆశ్రమ జీవిగా వుండిపోవటం మంచిది కాదు. అతను ఈ సమాజంలో వుంటూ ఇంకా ఎన్నో గొప్ప చిత్రాలుగీసి ప్రజలకు అందించవలసిన అవసరం వుంది. ఎలాగయినా అతన్ని ఒప్పించి, అతన్ని తెచ్చి మన మేడ పైని గదిలో వుంచుదాం. ఏమంటారు?" భర్తతో అంది.

"నేనేమంటాను. శ్రీమతిగారు అన్నదానికి చిత్తం! అంటాను" అన్నాడు శంకరం. సన్నగా నవ్వుతూ. ఓ వారం తర్వాత వీలు చేసుకొని భార్య భర్తలిద్దరూ అభిజిత్ వుంటున్న ఆశ్రమానికి వెళ్ళారు." జరిగింది పీడ కలలా మరచిపోండి! మళ్ళీ మీరు కుంచె చేతపట్టి ఎన్నో కళాఖండాలు సృష్టించాలి"అంటూ భార్యాభర్తలిద్దరూ మూడ్రోజులపాటు పోరీ, స్వామీజీతో చెప్పించి తమతోపాటు అభిజిత్ కూడా వెంట పెట్టుకొచ్చాడు. అన్న ప్రకారంగానే అతనికి మేడ పైని గదిలో బస కేటాయించారు. అతనికి కావలసినవన్నీ అమర్చిపెట్టారు.

అభిజిత్ మళ్ళీ కుంచె చేతపట్టాడు. ఓ కళాకారుడు అజ్ఞాతంగా వుండిపోకుండా, మళ్ళీ సమాజంలోకి వచ్చినందుకు, తెచ్చినందుకు ఆ భార్యాభర్తలిరువురిలో ఆనందం! ❋

రచయిత చిరునామా:
**ఎస్.డి.వి.అజీజ్,**
**46/634, బి.పేట**
**కర్నూలు-2**






ఇంటి వైద్యం

★ రక్తచందనం 20గ్రాములను చల్లటి నీటితో కలిపి ఆ జలాన్ని ఉదయం- సాయంత్రం సేవిస్తే అర్శమొలలకు ఉపయుక్తంగా ఉంటుంది.